క్లుప్తంగా

వయోధికుల చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

కాగజ్‌నగర్‌రూరల్‌: వయోధికుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సీనియర్‌ సిటిజన్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ కోరారు. ఆదివారం పట్టణంలోని సీనియర్‌ సిటిజన్స్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీల్లో డే కేర్‌ సెంటర్లు, ఆర్డీఓ, కలెక్టర్ల కార్యాలయాల్లో కౌన్సెలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈమేరకు జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలను అందించనున్నట్లు తెలిపారు.

‘మన్‌ కీ బాత్‌’ వీక్షణ

కాగజ్‌నగర్‌రూరల్‌: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఏర్పాటు చేసిన 114వ మన్‌కీ బాత్‌ కార్యక్రమాన్ని పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌ కార్యకర్తలతో కలిసి వీక్షించారు. భారతదేశాన్ని అగ్రగామిగా నిలపడమే బీజేపీ లక్ష్యమని, రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సరస్వతీ శిశుమందిరాల జిల్లా అధ్యక్షురాలు డాక్టర్‌ కొత్తపల్లి అనిత, నియోజకవర్గ కన్వీనర్‌ వీరభద్రచారి, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయా, నాయకులు అనిల్‌, మధుకర్‌, మురళీకృష్ణ, వెంకటేశ్‌, శ్రీనివాస్‌, సంతోశ్‌, రవి, రాజు, విజయలక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ క్రికెట్‌ మ్యాచ్‌



మ్యాచ్‌ అనంతరం పోలీసులతో విలేకరులు

కౌటాల: కౌటాల మినీ స్టేడియంలో ఆదివారం కౌటాల పోలీస్‌ టీం, ప్రెస్‌ టీంల మధ్య క్రికెట్‌ మ్యాచ్‌ నిర్వహించారు. సీఐ ముత్యం రమేశ్‌ ఫ్రెండ్లీ క్రికెట్‌ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఇందులో పోలీస్‌ జట్టు విజయం సాధించింది. అనంతరం సీఐ మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, నిత్యం బిజీగా ఉండే పోలీసులు, జర్నలిస్టులు ఆటలకు సమయం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కౌటాల, బెజ్జూర్‌ ఎస్సైలు మధుకర్‌, విక్రమ్‌, విలేకరులు ఉన్నారు.


ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలి

కౌటాల: మండల కేంద్రంలోని అంబేద్కర్‌ భవనం ఆవరణలో ఆదివారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ భారత రాజ్యాంగానికి వ్యతిరేకమన్నారు. ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలని డిమాండ్‌ చేస్తూ త్వరలో జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ తీసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కాగజ్‌నగర్‌ డివిజన్‌ అధ్యక్షుడు బండురావ్‌, ప్రధాన కార్యదర్శి జాడి దిలీప్‌, యూత్‌ అధ్యక్షుడు దుర్గం విజయ్‌, నాయకులు విశ్వనాథ్‌, ప్రకాశ్‌, నాందేవ్‌, ధన్‌రాజ్‌, కుషాశ్‌రావు, అనిల్‌, ఆత్మరాం పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

దహెగాం: మండలంలో ఉపాధిహామీ పథకంలో కొనసాగిన పనులపై గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఈజీఎస్‌ ఏపీవో కల్పన ఆదివారం తెలిపారు. 2023 ఏప్రిల్‌ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామ సభలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. సోమవారం ఒడ్డుగూడ, లగ్గాం, బోర్లకుంట, ఇట్యాల, గెర్రె, చినరాస్పెల్లి, కుంచవెల్లి, ఐన, కల్వాడ, అక్టోబర్‌ 1న మొట్లగూడ, కర్జి, చంద్రపల్లి, 3న భామానగర్‌, చౌక, పీపీరావు కాలనీ, 4న బీబ్రా, దిగిడ, గిరవెల్లి, పెసరికుంట, హత్తిని, రాంపూర్‌, దహెగాంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సెకండ్‌ ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్‌: సెకండ్‌ ఏఎన్‌ఎంలను ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉపేందర్‌ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలు తీసుకుంటూ, ప్రజల ఆరోగ్యం కాపాడటంతో రెండో ఏఎన్‌ఎంలు కీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వారి సేవలను గుర్తించి వెంటనే రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్‌, చిరంజీవి, సంతోషి, సునీత, పుణ్యవతి, జ్యోతి, లక్ష్మి, లలిత తదితరులు పాల్గొన్నారు.

కాలువలకు మరమ్మతులు ఎప్పుడో..?



ప్రాజెక్టు తూమును పరిశీలిస్తున్న నీటి పారుదల శాఖ ఈఈ ప్రభాకర్‌



కూలిపోయిన సిమెంట్‌ వాల్‌ వద్ద కాలువలోకి చేరిన మట్టి

- కూలిన కాలువలు
- పొలాలకు అందని సాగు నీరు
- ఆందోళనలో రైతులు

పెంచికల్‌పేట్‌: మండలంలోని ఎల్లూర్‌ వద్ద నిర్మించిన బొక్కివాగు ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నా పంట పొలాలకు అందడం లేదు. 2వేల ఎకరాలకు సాగునీటిని అందించాలనే సంకల్పంతో 2012లో ప్రాజెక్టును నిర్మించారు. కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని అందించటానికి సిమెంట్‌ వాల్స్‌తో కాలువల నిర్మాణం పూర్తి చేశారు. ఏళ్ల క్రితం నిర్మించిన కాలువలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలువలు కూలిపోయి రైతుల పంట పొలాలకు నీరు అందడం లేదు. దీంతో పంట పొలాలు ఎండిపోతున్నాయి.

మరమ్మతులకు నోచుకోని తూము..

ప్రాజెక్టు నుంచి కాలువలకు నీటిని విడుదల చేయటానికి ఎల్లూర్‌, మెరెగూడ వద్ద రెండు తూములను ఏర్పాటు చేశారు. ఇరువైపుల ఉన్న తూములను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో ప్రాజెక్టు నుంచి నిరంతరాయంగా నీరు వృథాగా పోతూ పెద్దవాగులో కలుస్తుంది. పంట పొలాలకు చేరాల్సిన నీరు తూము, కాలువలకు చేరక పోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు మరమ్మతులు చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులకు నిధులు మంజూరు చేసి ప్రాజెక్టు కాలువలు, తూములు బాగు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

వృథాగా పోతున్న నీరు



ప్రాజెక్టు తూములు చెడిపోవడంతో నిరంతరాయంగా నీరు ప్రాజెక్టు నుంచి పోతోంది. ప్రాజెక్టు కింద వరి పంటను సాగు చేస్తున్న రైతులకు నీరు అందడం లేదు. ప్రాజెక్టులో నీరు ఉన్నా పంట పొలాలకు చేరక పంటలు ఎండిపోతున్నాయి. అధికారులు స్పందించి తూము వద్ద మరమ్మతులు చేపట్టాలి.

– సుంపుటం లాంచు, రైతు, ఎల్లూర్‌

కూలిపోతున్న కాలువలు



ప్రాజెక్టుకు ఇరువైపులా నీటిని పంట పొలాలకు అందించడానికి ఏర్పాటు చేసిన కాలువల్లో మట్టి కూరుకుపోతోంది. సిమెంట్‌వాల్స్‌ కూలిపోవడంతో నీరు పంట పొలాలకు అందడం లేదు. మరోవైపు కాలువల్లోకి మట్టి చేరడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. కాలువల్లో నుంచి నీరు పెద్ద వాగు, బొక్కివాగులోకి వృథాగా పోతుంది. అధికారులు మరమ్మతులకు నిధులు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలి.

– ఘనపురం కృష్ణమూర్తి, ఎల్లూర్‌

పని చేయని నిఘా నేత్రం

- నిర్వహణ లేక మూలకు పడ్డ వైనం
- పట్టించుకోని అధికారులు



కుమురం భీం చౌరస్తా వద్ద అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు

తిర్యాణి: ఒక్కో సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, నేరస్తులను పట్టుకోవడంలో వీటి సహకారం ఎంతో ముఖ్యమని గతంలో పోలీసుశాఖ అధికారులు అవగాహన కల్పించారు. కానీ క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయక మూలకు పడుతున్నాయి. మండలంలో నిఘా పెంచేందుకు ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిర్వహణ లేకపోవడంతో కొన్ని నెలలుగా అలంకారప్రాయంగా మారాయి. పోలీసులు అవగాహన కల్పించి దుకాణ సముదాయాల ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. అవి సక్రమంగా పనిచేస్తున్నప్పటికీ, ప్రధాన ఏరియాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మాత్రం నిర్వహణ లేక మూలకుపడ్డాయి. ఈ విషయంపై ఎస్సై తీగల మాధవ్‌ను వివరణ కోరగా, స్థానికుల సహకారంతో మరమ్మతులు చేయిస్తామన్నారు.

కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ



ఆలయంలో ఎమ్మెల్సీ దండే విఠల్‌

బెజ్జూర్‌: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కుల సంఘం దేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి అమ్మవారిని ఎమ్మెల్సీ దండే విఠల్‌ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారి ఆలయం చుట్టూ కాంపౌండ్‌ వాల్‌ నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఆయన వెంట టీపీసీసీ మెంబర్‌ అర్షద్‌ హుస్సేన్‌, జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్‌ సిడాం గణపతి, బెజ్జూర్‌ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్‌, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పుల్లూరి సంతోష్‌, బోగ అనిల్‌, రెనుకుంట్ల పెంటన్న, నాయకులు నహీర్‌ ఆలీ, అశోక్‌, అదే అశోక్‌, మోహన్‌ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ కొండ్ర మనోహర్‌ గౌడ్‌, మాజీ సర్పంచ్‌ జగ్గా గౌడ్‌, సురేశ్‌ గౌడ్‌, నరేందర్‌ గౌడ్‌ తల్లి బుచ్చమ్మ సంవత్సరికం కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి, జెడ్పీ మాజీ చైర్మన్‌ కోనేరు కృష్ణారావు, బెజ్జూర్‌ మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్‌ రావు, పుష్పలత కాంగ్రెస్‌ నాయకులు రావి మురళీకృష్ణలు సింగిల్‌ విండో మాజీ చైర్మన్‌ హర్షత్‌ హుస్సేన్‌ పరామర్శించారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ



గిరిజనులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్‌: శ్రీమిత్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని రేగులగూడ గ్రామానికి చెందిన గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారు. పేదలను ఆదుకోవాలనే ఉద్దేశంతో పేదలకు దుస్తులను పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపకులు సుంకరి తిరుపతి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మంజుల, ప్రధానకార్యదర్శి ప్రభాకర్‌, మహిళా అధ్యక్షురాలు పొన్న స్రవంతి కమలాకర్‌, శ్రీలక్ష్మి రాంగోపాల్‌, సహాయక కార్యదర్శి పులిశెట్టి వినోద్‌, జాడి ఇంద్ర, పద్మావతి, దేవేందర్‌, మల్లేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సేవా సంఘం ఎన్నికల షెడ్యూల్‌ విడుదల



పద్మశాలి సేవా సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న ఎన్నికల అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్‌: పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శుల ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల అధికారులు గడదాసు నారాయణ, దాసరి శ్రీకాంత్‌లు విడుదల చేశారు. ఆదివారం పట్టణంలోని ద్వారకానగర్‌లో గల పద్మశాలి సేవా సంఘం కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్‌ విడుదల చేశారు. వారు మాట్లాడుతూ అక్టోబర్‌ 2 నుంచి 4వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్‌ల స్వీకరణ, 4న సాయంత్రం 4 గంటలకు నామినేషన్‌ వేసిన అభ్యర్థుల వివరాలు ప్రచురణ, 5న నామినేషన్‌ పత్రాల పరిశీలన, 6న నామినేషన్‌ల ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం 4 గంటలకు అభ్యర్థుల తుదిజాబితా విడుదల, 13న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నికలు, సాయంత్రం 6 గంటల నుంచి పోలైన ఓట్ల లెక్కింపు తదుపరి ఫలితాలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. సంపత్‌కుమార్‌, రాజయ్య, రవికుమార్‌, సదానందం, విశ్వేశ్వర్‌రావు, శంకరయ్య, వెంకటి, వెంకటరాములు, నారాయణ పాల్గొన్నారు.

ఖరీఫ్‌ సాగు బాగు..!

- పంటలకు అనుకూలంగా వర్షాలు
- ఏపుగా పెరిగిన పత్తి మొక్కలు
- జిల్లాలో 3.26 లక్షల ఎకరాల్లో సాగు



తలోడిలో పూత, కాత దశలో పత్తి పంట

కౌటాల: ఏటా పత్తి పంట సాగు చేస్తున్న రైతులు అతివృష్టి, అనావృష్టి వంటి కారణాలతో నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. కానీ ఈసారి ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పత్తి పంటకు అనుకూలంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి జిల్లాలో రైతులు సాగు చేస్తున్న పత్తి, సోయా పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. పత్తి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. పచ్చని చేలతో కళకళలాడుతున్న పంటలను చూసిన రైతులు.. ఆశించిన దిగుబడులు చేతికి అందుతాయని భావిస్తున్నారు. జిల్లాలోని 1.20 లక్షల మంది రైతులు 4.40 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అత్యధికంగా 3.26 లక్షల ఎకరాల్లో పత్తి, 62,209 ఎకరాల్లో వరి సాగు చేశారు.

అనుకూలంగా వర్షాలు..

ఈ ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు కురవడంతో రైతులు పత్తి విత్తనాలు వేశారు. అనంతరం ఆడపాదడపా కురుస్తున్న వర్షాలతో పత్తి పంటకు మేలు జరుగుతోంది. ఆశించిన స్థాయిలో తేమశాతం అందడంతో మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. రెండేళ్లుగా ఏటా జూలై చివరి వారం, ఆగస్టు మొదటివారంలో భారీ వర్షాలు కురిసి చేలు నిండా నీరు నిలిచేవి. పంట కలుపు మొక్కలతో, తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక తదితర తెగుళ్లు అధికంగా ఆశించేవి. ఈ ఏడాది మొక్కలు పూత, కాత దశకు చేరుకున్నాయి. కానీ పంటకు భారీగా నష్టం కలిగించే ఎలాంటి తెగుళ్లు సోకలేదని రైతులు పేర్కొంటున్నారు.

జిల్లాలో సాగు..

జిల్లాలోని కౌటాల, బెజ్జూర్‌, చింతలమానెపల్లి, సిర్పూర్‌(టి), పెంచికల్‌పేట్‌, దహెగాం, కెరమెరి, వాంకిడి, రెబ్బెన, ఆసిఫాబాద్‌ తదితర మండలాల్లో పత్తి సాగు విస్తీర్ణం అధికంగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. జిల్లాలోని రైతులు ఈసారి బీటీ 2 రకం పత్తి విత్తనాలు వేశారు. ప్రభుత్వం నిషేధించిన పత్తి విత్తనాల జాడ మార్కెట్‌లో ఈసారి కన్పించలేదు. దీంతో చీడపీడలు, తెగుళ్ల బెడద పత్తి పంటపై కనిపించడం లేదన్న ప్రచారం జరుగుతోంది. ఈసారి పంట ఆశాజనకంగా ఉండడంతో కష్టాలు గట్టెక్కినట్టేనని రైతులు భావిస్తున్నారు.

దిగుబడిపై ఆశలు

పత్తి పంట ఏపుగా పెరిగి పూత దశలో ఉండడంతో ఈసారి దిగుబడి పెరుగుతుందన్న ఆశలో రైతులు ఉన్నారు. ప్రభుత్వం పత్తి సాగును ప్రోత్సహిస్తున్న పరిస్థితుల్లో పంట విక్రయానికి ఇబ్బందులు ఉండకపోవచ్చని రైతులు అంటున్నారు. పత్తి ధర ఈ ఏడాది మార్కెట్‌లో రూ.10 వేల వరకు పలుకుతుందని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం పత్తి పంటకు మద్దతు ధర పెంచాలని రైతులు కోరుతున్నారు.

పత్తి పంట బాగానే ఉంది



నేను మూడు ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్న. ఈసారి వర్షాలు బాగా కురుస్తుండడంతో పంట బాగుంది. పత్తి పంట వేసి వంద రోజులు దాటింది. పంట వేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎరువులతో పాటు పంటపై మందు పిచికారీ చేశాను. పంట ఏపుగా పెరిగింది. ప్రస్తుతం పంట పూత, కాత దశకు చేరింది. పంటకు ఎలాంటి పురుగుల బెడద లేదు. కాలం కలిసి వస్తే ఎకరాకు 10 క్వింటాళ్ల పత్తి దిగుబడి రావచ్చు. పత్తి పంటకు ప్రభుత్వం మద్దతు ధర పెంచాలి.

– పోచయ్య, రైతు, యాపలగూడ

పారిశుధ్యంపై పట్టింపు కరువు

రెబ్బెన: గంగాపూర్‌ గ్రామ పంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో పారిశుధ్యం లోపించింది. ప్రధాన రహదారి నుంచి జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా సైడ్‌ డ్రెయిన్‌ లేకపోవడంతో మురికి నీరంతా రోడ్డు పైనే పారుతోంది. ఇళ్ల మధ్యలో మురికినీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. మురికి కాలువ ఉన్న చోట నిర్వహణ సరిగా లేక పిచ్చిమొక్కలు పెరిగాయి. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు.



ఇళ్ల మధ్యలో నిలిచిన మురికినీరు



మురుగునీటి ప్రవాహంతో బురదగా మారిన రోడ్డు



సైడ్‌ డ్రెయిన్‌ లేకపోవడంతో లోపించిన పారిశుధ్యం



జెడ్పీ హైస్కూల్‌ ఎదుట అపరిశుభ్ర వాతావరణం



పిచ్చిమొక్కలతో నిండిన సైడ్‌ డ్రెయిన్‌

‘కార్మికులకు అన్యాయం చేస్తున్న యాజమాన్యం’

కాగజ్‌నగర్‌రూరల్‌: ఎస్పీఎం కార్మికులకు మిల్లు యాజమాన్యం అన్యాయం చేస్తుందని బీఎంఎస్‌ అనుబంధ ఎస్పీఎం వర్కర్స్‌ యూనియన్‌ అధ్యక్షుడు కల్లోల భట్టాచార్య అన్నారు. ఆదివారం పట్టణంలోని బీఎంఎస్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లు కార్మికుల క్వార్టర్ల అద్దె, విద్యుత్‌చార్జీలు పెంచిందని, స్థానికేతరులకు అధిక వేతనాలను చెల్లిస్తూ స్థానికులకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌ అధికారంలో ఉండగా మిల్లు మూతకు గురైందన్నారు. మిల్లును కేవలం రాజకీయ లబ్ధి కోసమే తెరిపించి స్థానిక కార్మికులను విధుల్లోకి తీసుకోకుండా రాజకీయం చేస్తున్నారన్నారు. నేటికి 260 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాల్సి ఉందన్నారు. బీఎంఎస్‌ ఎస్పీఎం వర్కర్స్‌ యూనియన్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ వెంకటేశ్‌, ప్రధాన కార్యదర్శి గణపతి, జిల్లా కార్యదర్శి మోర్లె నానాజీ, సహాయ కార్యదర్శి అన్నం రాజన్న తదితరులు పాల్గొన్నారు.